సేవకులపై చిల్లర రాజకీయాలా..!


పాలసముద్రం మండల కేంద్రంలో పవన్‌కల్యాణ్ దిష్టిబొమ్మను ఊరేగిస్తున్న వలంటీర్లు

- నిత్యం ప్రజాసేవలో పరితపిస్తున్న వలంటీర్లపై అసత్య ఆరోపణలా ?
- కరోనా సమయంలో వారి సేవలు అనన్య సామాన్యం
- రాజకీయ లబ్ధి కోసం జనసేన అధినేత పవన్ కల్యాణ్ పిచ్చి ప్రేలాపణలు
- భగ్గుమంటున్న వలంటీర్లు

పాలసముద్రం : నిత్యం ప్రజాసేవలో పరితపిస్తున్నారు వలంటీర్లు. గ్రామంలో ఏ మూలకు వెళ్లిన వలంటీర్ల సేవల గురించి గొప్పగా చెబుతారు ప్రజలు. అలాంటి వారిపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు పెద్దదుమారం రేపాయి. వలంటీర్ల ప్రజల సమాచారాన్ని, ముఖ్యంగా ఒంటరి మహిళల వివరాలను పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించడంపై వలంటీర్ల నుంచి ఆగ్రహజ్వాలలు వ్యక్తం అవుతున్నాయి. తమ గురించి ప్రజలను అడిగితే చెబుతారని, పవన్‌కల్యాణ్‌కు ఏమి తెలుసని మాట్లాడుతున్నారని ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా పవన్ నోరు అదుపులో పెట్టుకోవాలని, లేదంటే తమ పవర్ ఏంటో చూపిస్తామని హెచ్చరిస్తున్నారు. గురువారం మండల కేంద్రం పాలసముద్రంలో వలంటీర్లు పవన్‌కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

కరోనా సమయంలో ఎనలేని సేవలు..

యావత్ ప్రపంచాన్ని కరోనా మహమ్మారి కుదిపిస్తే, వలంటీర్లు మాత్రం ప్రాణాలకు తెగించి ప్రజలకు విశేష సేవలు అందించారు. కరోనా సమయంలో ఎక్కడో మూలన దాక్కున పవన్ కల్యాణ్ ఇప్పుడు వచ్చి తమ గురించి అసత్య ఆరోపణలు చేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ప్రజలకు సమయంలో కుటుంబ సభ్యులు కూడా దగ్గరకు రాని సమయంలో వలంటీర్లే అన్నివిధాలా సాయం చేశారు.



ఇతని పేరు జయకుమార్. ఈయన శ్రీకావేరిరాజుపురం గ్రామ సచివాలయ పరిధిలో వలంటీర్ పని చేస్తున్నాడు. ఆనందన్ అనే వ్యక్తి గతేడాది కాలంగా అనారోగ్యంతో బెంగళూరు ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అక్కడే కుమారుడి ఇంట్లో ఉంటున్నాడని తెలిసింది. దీంతో వలంటీర్ జయకుమార్ తన సొంత ఖర్చులతో బెంగళూరుకి వెళ్లి ఆనందన్‌కు పింఛన్ అందిస్తున్నాడు. సుమారు 230 కిలోమీటర్లు వెళ్లి రావడం ఆషామాషీ కాదు.

ఈమె పేరు కోకిల. వెంగళరాజుకుప్పం గ్రామ సచివాలయ పరిధిలోని వీర్లగుడి గ్రామంలో వలంటీర్‌గా పని చేస్తోంది. ఈమెకు అధికారులు 50 కుటుంబాలను కేటాయించారు. అయితే గ్రామానికి చెందిన మౌలా సాహెబ్ అనే వృద్ధుడు అనారోగ్యంతో తిరుపతి రుయా ఆస్పత్రిలో మూడు నెలలుగా చికిత్స పొందుతున్నాడు. ఆయనకు ప్రభుత్వ పింఛన్ ఇస్తోంది. ప్రతి నెల 1వ తేదీ వలంటీర్ మౌలాసాహెబ్‌కు పింఛన్ అందిస్తోంది. ఈ నెలా అతను ఆస్పత్రిలో ఉన్నాడని తెలిసి సొంత ఖర్చులు పెట్టుకుని వెళ్లి పింఛన్ నగదు రూ.2750 అందించింది. దీంతో మౌలా కుటుంబ సభ్యులు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.



పవన్‌ను ఎవరూ నమ్మరు..



మా పిల్లల కంటే వలంటీర్లు ఎంతో గౌరవంగా మాట్లాడతారు. ప్రతి నెలా తెల్లవారుజామున ఐదు గంటలకే తలుపు తట్టి పింఛన్ అందిస్తున్నారు. అలాంటి వలంటీర్లను అవమానిస్తే పుట్టగతులు ఉండవు. రాజకీయంగా సీఎం జగన్‌ను ఎదుర్కోలేక చంద్రబాబుతో పవన్‌కల్యాణ్ కలసి వ్యవస్థలపై అసత్య ఆరోపణలు చేస్తున్నారు. ఇలాంటి చౌకబారు మాటలను రాష్ట్రప్రజలు నమ్మరు.

– పాపమ్మ, కన్నికాపురం, పింఛను లబ్ధిదారుడు

చేయూత ఇచ్చిన వలంటీర్లు..



ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులుగా వలంటీర్లు పని చేస్తున్నారు. నేను ఎక్కడా ఉన్నా ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్ అందిస్తోంది మా వలంటీర్. ఇంటి వద్దకే వచ్చి పథకాలకు సంబంధించి వివరాలు చెప్పి వెళ్తారు. అలాగే అర్హత ఉంటే మాకు అవి అందేలా చూస్తున్నారు. ఇంతమంచి సేవలు అందిస్తున్న వలంటీర్ల గురించి నీచంగా మాట్లాడ్డం పవన్‌కల్యాణ్‌కు తగదు. వలంటీర్ల సేవలు మరువలేనివి.

– రాజేంద్రన్, లబ్ధిదారుడు

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష


పాలసముద్రం: ధ్రువీకరణ పత్రాలు అందుకున్న లబ్ధిదారులతో ప్రజాప్రతినిధులు, అధికారులు

పాలసముద్రం : సమస్యల సత్వర పరిష్కారానికే రాష్ట్రప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందని జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, వైస్ ఎంపీపీలు శేఖర్ యాదవ్, పుష్ప తెలిపారు. గురువారం వెంగళరాజుకుప్పం గ్రామ సచివాలయ ఆవరణలో తహసీల్దార్ బాబు, సర్పంచ్ లిల్లీ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారన్నారు. ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజలు మండల కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేదని, వారు ఉన్న చోటే ఉచితంగా 11 రకాల ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్నామని తెలిపారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షురాలు ఇందిరమ్మ, వైస్ సర్పంచ్ సుమన్, ఏఓ డిల్లీబాబు, పంచాయతీ కార్యదర్శి సుధ, వీఆర్‌ఓ శంకర్, ఐకేపీ ఏపీఎం ఫరీద్‌మస్తాన్, పీహెచ్‌సీ సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ మురళి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

వేడుకగా బాబాకు పాలాభిషేకం


భక్తుల స్వహస్తాలతో బాబాకు పాలాభిషేకం చేస్తున్న భక్తులు

పుత్తూరు రూరల్: పట్టణంలోని శ్రీషిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం బాబాకు భక్తుల స్వహస్తాలతో పాలాభిషేకం వేడుకగా జరిగింది. గురు పౌర్ణమిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన పాలాభిషేకం కార్యక్రమం తెల్లవారుజామున 4.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగింది. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు క్యూలైన్లలో వేచి ఉండి పాలాభిషేకం చేసి మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు వేకువజామున 2.30 గంటలకు సుప్రభాత సేవతో బాబాను మేల్కొప్పారు. ఉదయం 3.30 గంటలకు కాగడ హారతి ఇచ్చారు. అలాగే ఆలయంలో మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం సంధ్య హారతి, రాత్రి 8 గంటలకు పవలింపు హారతి ఇచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

సీఏ కోర్సుపై అవగాహన


సదస్సును ప్రారంభిస్తున్న అతిథులు, ఎస్‌ఐఆర్‌సీ ఆఫ్ ఐసీఏఐ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: ఎస్‌ఐఆర్‌సీ ఆఫ్ ఐసీఏఐ తిరుపతి బ్రాంచ్ ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రంలో గురువారం విద్యార్థులకు సీఏ కోర్సుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టీటీడీ అడిషనల్ ఎఫ్‌ఏ, సీఏఓ రవిప్రసాద్, టీటీడీ డీఈఓ డాక్టర్ ఎం.భాస్కర్‌రెడ్డి హాజరై సదస్సును ప్రారంభించారు. కెరియర్ కౌన్సెలింగ్ కమిటీ జాతీయ అధ్యక్షుడు రోహిత్ రువాటియా, ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్ అదుకియా, సెంట్రల్ కౌన్సిల్ సభ్యుడు డి.ప్రసన్నకుమార్, ఎస్‌ఐఆర్‌సీ ఎస్ ఐసీఏఎస్‌ఏ అధ్యక్షుడు చెంగల్‌రెడ్డి చార్టెడ్ అకౌంటెన్సీ కోర్స్ గురించి వివరించారు. ఏసీ సురేష్‌కుమార్ విద్యార్థులకు సీఏ కోర్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన 1,500 మంది విద్యార్థులు, పాఠశాలల యాజమానులు, తిరుపతి ఎస్‌ఐసీఏఎస్‌ఏ అధ్యక్షుడు జగదీష్ కృష్ణ, కామిశెట్టి బాలాజీ, ఉపాధ్యక్షుడు రవీంద్రారెడ్డి, కార్యదర్శి మధుసూదన్ బాబు, కోశాధికారి మన్యం సింహాద్రి, నరసింహులు పాల్గొన్నారు.

వాణిజ్య పంటల సాగుతో లాభాలు

కార్వేటినగరం: వాణిజ్య పంటల్లో లాభసాటిగా ఉన్న పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని ఏఓ హేమలత అన్నారు. గురువారం కత్తెరపల్లి, అమ్మపల్లిలోని రైతు భరోసా కేంద్రాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఏఓ మాట్లాడుతూ రైతులకు సాధారణ పంటల కన్నా లాభసాటిగా ఉండే వాణిజ్య పంటలపై అవగాహన కల్పించి మంచి దిగుబడిని పొందే విధంగా చూడాలన్నారు. అదేవిధంగా ఆర్బీకేల్లో ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న ఎరువులు, విత్తనాల వివరాలను కార్యాలయం డ్యాష్ బోర్డులో వివరాలను పొందుపరచాలని తెలిపారు. వారానికి ఒకసారి రైతులతో సమావేశం ఏర్పాటు చేసి పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలని సూచించారు. పంటలో చీడపీడల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించాలన్నారు. ఆమె వెంట ఆర్బీకే సిబ్బంది ఉన్నారు.


కత్తెరపల్లి రైతుభరోసా కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ హేమలత

టాటాసుమోను ఢీకొన్న ట్రాక్టర్


మృతిచెందిన ఉమాపతి


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన టాటాసుమో

శ్రీరంగరాజపురం : ట్రాక్టర్ ఓ టాటాసుమో ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలోని క్షీర సముద్రం సంగం డెయిరీ వద్ద గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ షెక్షావలి కథనం మేరకు .. నెలవాయి దళితవాడకు చెందిన తంగవేలు కుమారుడు ఉమాపతి (37) చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిలో చిల్లమాకులపల్లికి టాటాసుమోలో వెళ్తున్నాడు. అదే సమయంలో చిత్తూరు నుంచి పుత్తూరుకు మామిడి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ సంగం డెయిరీ వద్ద రాగానే టాటాసుమోను ఢీకొంది. దీంతో సుమో డ్రైవర్ ఉమాపతి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్ పరారైనట్లు పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

ఘనంగా వీడ్కోలు


బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులతో హెచ్‌ఎం, సర్పంచ్, తోటి సిబ్బంది

నగరి : మండలంలోని గుండ్రాజుకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు మనోజ్‌కుమార్, హరిప్రసాద్, మురళి, శ్రీనివాసులును ఘనంగా సత్కరించారు. గురువారం స్థానిక పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారికి తోటి ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న వారిని దుశ్శాలువలు, పూలదండలు వేసి సత్కరించారు. హెచ్‌ఎం నీరజారాణి, సర్పంచ్ బాలప్రసాద్ రెడ్డి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో వారి వంతు కృషిచేశారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన


ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

నగరి : మండలంలోని మిట్టపాళెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై రాష్ట్ర ప్రాజెక్టు మేనేజర్ రామచంద్ర, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు అవగాహన కల్పించారు. గురువారం మిట్టపాళెంలో ప్రకృతి వ్యవసాయంలో సాగు చేసే పొలాల వద్ద పొలంబడి కార్యక్రమాన్ని వారు నిర్వహించారు. పంటలను పరిశీలించిన వారు ఐసీఆర్‌పీఎస్‌ల ఎల్1 రిజిస్టర్లను తనిఖీ చేశారు. ప్రధాన పంటల సాగులో అంతర పంటలుగా 16 రకాల పంటలు ఎలా సాగుచేయవచ్చో వివరించారు. కార్యక్రమంలో ఎన్‌ఎఫ్‌ఏ చందు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నాడు–నేడు పనులను వేగవంతం చేయండి


టీకేఎంపేట స్కూల్‌లో పనులను పరిశీలిస్తున్న ఎంఈఓ మనోజ్‌కుమార్

కార్వేటినగరం: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నాడు–నేడు పనులను వేగవంతం చేయాలని ఎంఈఓ మనోజ్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని టీకేఎం పేట ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రభుత్వ స్కూళ్ల బలోపేతం కోసం ప్రత్యేక చొరవ తీసుకుని మనబడి నాడు–నేడు పథకం ద్వారా స్కూళ్ల భవన నిర్మాణాలతో పాటు మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందని తెలిపారు. నాడు–నేడు పనులు చేపడుతున్న పాఠశాలల హెచ్‌ఎంలు నాడు–నేడు పనులపై దృష్టి సారించాలని సూచించారు. అలాగే సుద్దగుంట, రాజులకండ్రిగ, టీకేఎం పేట ప్రాథమిక పాఠశాలల్లో రికార్డులను పరిశీలించారు. అలాగే మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు.

ఆండాళ్ ఉత్సవాలు ప్రారంభం


తిరుచ్చి వాహనంలో విహరిస్తున్న ఆండాళ్

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆండాళ్ తిరువాడిపుర ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. తమిళ ఆడి నెలలో పది రోజుల పాటు ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర భట్టాచార్య తెలిపారు. ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్య పూజా కైంకర్యాలు పూర్తి చేశారు. ఆండాళ్ అమ్మవారికి అభిషేకాలను, అర్చనలను చేశారు. సాయంత్రం తిరుచ్చి వాహనాన్ని అధిరోహించిన ఆండాళ్ అమ్మవారు మాడవీధుల్లో విహరించారు. భక్తుల నుంచి హారతులు అందుకుని ఆలయానికి చేరుకున్న అమ్మవారికి ఆస్థానం నిర్వహించారు.

ఎల్‌ఐసీ లడ్డూ కౌంటర్ల నిర్వహణ

తిరుమల: శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు సేవలను అందించడంలో భాగంగా పది లడ్డూ కౌంటర్ల నిర్వహణను చేపట్టినట్లు ఎల్ఐసీ ప్రాంతీయ మేనేజర్ దీపా శివదాసన్ తెలిపారు. ఎల్‌ఐసీ తరపున లడ్డూ కౌంటర్ల నిర్వహణను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ పది లడ్డూ కౌంటర్ల నిర్వహణ ఖర్చులను ఎల్‌ఐసీ భరించనుందని తెలిపారు. టీటీడీ ఏఈవో ఆర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు


సర్టిఫికెట్లు అందుకున్న వారితో మంత్రి ఆర్‌కే రోజా

- సీఎం జగనన్న పాలనలో ప్రతిరోజూ పండగే
- ఒక్క ఓజీకుప్పం సచివాలయ పరిధిలోనే సంక్షేమం, అభివృద్ధికి రూ.12.5 కోట్లు వెచ్చించాం
- ఇవి తెలియని టీడీపీ నాయకులు ప్రభుత్వం ఏం చేసిందని వాగుతున్నారు
- మంత్రి ఆర్‌కే రోజా


సమావేశానికి హాజరైన జనం

నగరి : ప్రభుత్వ సేవలు ప్రజలకు ఇంటి వద్దే ఉచితంగా అందించడానికే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడా శాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. గురువారం మండంలోని ఓజీకుప్పం సచివాలయ పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జగనన్న సురక్షలో నమోదు చేసుకున్న 651 సర్టిఫికెట్లు ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలాంటి ఇబ్బందులు, కష్టాలు లేకుండా నేడు 318 మందికి ఆదాయ సర్టిఫికెట్లు, 315 మందికి ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు, 10 మందికి ఆధార్ మొబైల్ లింకింగ్, 5 గురికి బర్త్ సర్టిఫికెట్లు, ఇద్దరికి ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్లు, ఒకరికి హౌస్‌హోల్డ్ విభజన జరిగిందంటే అందుకు జగనన్న ప్రవేశపెట్టి సురక్ష పథకమే కారణమన్నారు. 11 రకాల సర్టిఫికెట్లు అందించడంతో పాటు పథకాలకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. సచివాలయ పరిధిలోని గ్రామాల్లో సంక్షేమం, అభివృద్ధికి రూ.12.50 కోట్లు ప్రభుత్వం వెచ్చించిందన్నారు. ఇదిగాక ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ అంటూ ప్రజలకు లబ్ధి చేకూరిందన్నారు.

ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన వైద్యసేవలు..


గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని త్వరలో గ్రామంలో నిర్వహిస్తామని, ఇక్కడ తన దృష్టికి వచ్చిన సమస్యలను గడపగడపకు మన ప్రభుత్వం నిధుల ద్వారా నెరవేరుస్తామన్నారు. ఇవేమీ తెలియని టీడీపీ నాయకులు ఏం అభివృద్ధి జరిగిందని వాగుతున్నారని, వారికి ప్రజలే సమాధానం చెప్పాలన్నారు. కరోనా సమయంలో మన ప్రభుత్వం చేసినన్ని సేవలు దేశవ్యాప్తంగా ఎవరూ చేయలేదన్నారు. ఆరోగ్యశ్రీలో మూడు వేలకు పైగా జబ్బులను చేర్చి మెరుగైన సేవలు అందిస్తున్న ఘతన వైఎస్సార్‌సీపీదే అన్నారు. రెండుసార్లు ప్రజల ఆదరణతోనే ఇప్పుడు తాను మంత్రిగా ఉన్నానని, నిత్యం వారి కోసమే కష్ట పడుతున్న తనను మూడోసారి కూడా తప్పక ఆదరిస్తారన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి వెటర్నరీ ఏడీ వాసు, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీడీఓ లీలామాధవి, ఎంపీపీ భార్గవి, వైస్‌ఎంపీపీ కన్నియప్ప, సర్పంచ్ మోహన్, సచివాలయ కన్వీనర్ హరి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కోప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న దుర్యోధన వధ


దుర్యోధన వధ సన్నివేశంలో దుర్యోధనుడు, భీమసేనుడి వేషధారులు

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం) : మండలంలోని గడ్డంపల్లె గ్రామంలో వెలసిన ధర్మరాజుల స్వామి మహాభారత ఉత్సవాల్లో భాగంగా ధర్మకర్తలు చంద్రారెడ్డి, గురవారెడ్డి ఆధ్వర్యంలో గురువారం జరిగిన గదాయుద్ధం, దుర్యోధన వధ ఘట్టాలు రసవత్తరంగా సాగాయి. వేంకటేశ్వర నాట్యబృందంలోని కళాకారులు భీమసేనుడు, దుర్యోధనుడి పాత్రధారులు కనులకు కట్టినట్లు ప్రదర్శించారు. సర్వం కోల్పోయిన దుర్యోధనుడు అస్త్రసన్యాసం చేసి గంగలో తపస్సుకు వెళ్తాడు. అప్పుడు భీమసేనుడు గంగలో తపస్సు చేస్తున్న దుర్యోధనున్ని బయటకు రప్పించే సన్నివేశం ఆహుతులను ఆకట్టుకుంది. అనంతరం భీకర యుద్ధ పోరాటంలో దుర్యోధనున్ని వధించే సన్నివేశాలను కళాకారులు రక్తి కట్టించారు. సర్పంచ్ గోవిందయ్య, సుబ్రమణ్యరెడ్డి, రామచంద్రారెడ్డి, మేనేజర్ గోవిందరాజులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

స్మార్ట్‌బోర్డు బోధనతో విజ్ఞానం


న్యాక్ టీంతో కళాశాల బృంద సభ్యులు

కార్వేటినగరం: స్మార్టుబోర్టు బోధన, ఇంటర్నెట్ సౌకర్యంతో విద్యార్థులు మరింత విజ్ఞానాన్ని పొందవచ్చని న్యాక్ పీర్ టీం తెలిపారు. గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను న్యాక్ టీం రెండవరోజు సందర్శనలో భాగంగా పలు విభాగాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులను కళాశాలలో మౌలిక వసతులు, బోధనకు సంబంధించిన విధానాల వివరాలను ప్రశ్నించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు నిర్వహించిన నృత్య ప్రదర్శనను న్యాక్ టీం తిలకించారు. సాయంత్రం వీడ్కోలు సమావేశంలో న్యాక్ టీం చైర్మన్ మాట్లాడుతూ డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు స్మార్ట్‌బోర్డు బోధన, 24 గంటల ఇంటర్నెట్, అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్, జేకేసీ ద్వారా ఉద్యోగ అవకాశాలను కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు కళాశాలలోని బోధన వసతులు, ఆధునిక పద్ధతులను ఉపయోగించుకుని సంపూర్ణ విజ్ఞానాన్ని సాధించవచ్చని న్యాక్ టీం కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపక బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజియులురెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర బృందం, పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు

- కొత్తపల్లె మిట్ట రోడ్డు తక్షణ మరమ్మతులకు రూ.8 కోట్లు కేటాయింపు
- ఆర్‌అండ్‌బి ఇంజినీరింగ్ చీఫ్‌కు డిప్యూటీ సీఎం నారాయణస్వామి వినతి


ఇంజినీరింగ్ చీఫ్‌కు ప్రతిపాదన ప్రతులను అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం నుంచి శ్రీరంగరాజపురం మండలంలోని కొత్తపల్లెమిట్ట వరకు ఉన్న ప్రధాన రహదారిని విస్తరింప చేయాలని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ఆర్‌అండ్‌బీ ఇంజినీరింగ్ చీఫ్ ఇనయతుల్లాను కోరారు. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి గురువారం అమరావతిలో ఇనయతుల్లాను కలిసి రోడ్డు విస్తరణకు సంబంధించి ప్రతిపాదన ప్రతులను అందజేశారు. గురువారం సాయంత్రం సాక్షి ప్రతినిధికి వివరాలను వెల్లడించారు. 27 కిలోమీటర్ల మేరకు ఈ రోడ్డు ఇరుకుగా ఉండడంతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నట్లు పేర్కొన్నారు. రోడ్డు ఆధునికీకరణకు నోచుకోకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారని, ప్రజల నుంచి నిత్యం ఫిర్యాదులు తమకు వస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా రోడ్డు అభివృద్ధి కాకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే రూ.50 కోట్లు నిధులు మంజూరు చేసి డబుల్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇదిలా ఉండగా ఈ రోడ్డు తక్షణ మరమ్మతుల కింద రూ.8 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. రోడ్డు మరమ్మతులకు గురవడంతో రెన్యూవల్ కింద బాగు చేయడం కోసం నిధులు మంజూరైనట్లు చెప్పారు. వెంటనే మరమ్మతు పనులు చేపడుతున్నట్లు చెప్పారు. డబుల్‌రోడ్డు నిర్మాణానికి సంబంధించి అవసరమైతే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని, నిధులు మంజూరు చేయాలని కోరగా, అందుకు ఇంజినీరింగ్ చీఫ్ సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. నిధులు మంజూరైతే కొత్తపల్లెమిట్ట రోడ్డుకు మహర్దశ రానుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయన వెంట గంగాధరనెల్లూరు నియోజకవర్గ బూత్‌కమిటీ కన్వీనర్ నారాయణరెడ్డి ఉన్నారు.